www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 7 నవంబర్ 2025
5
వైఎస్ఆర్

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - గోపవరం

మండలంలోని కుంట గ్రామానికి చెందిన దాసరి పొట్టెమ్మ, జగన్నాథం, రమణ దంపతులకు సిఎం సహాయనిధి ద్వారా రూ.52 వేల చెక్కును బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, గోపవరం మండలం వైస్ ఎంపిపి వి. రామ్మోహన్‌రెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు సిఎం సహాయనిధి ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన వారిని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున, పిచ్చయ్య, నారాయణ, నరసింహులు, నాగయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

జెఎల్ సీనియారిటీలో గూడుపుఠాణి

- గురుకుల ప్రిన్సిపల్లతో డిసిఒ కుమ్మక్కు?
- ఇష్టారాజ్యంగా సీనియారిటీ గుర్తింపు
- సీనియర్ల స్థానంలో జూనియర్లు
- డిసిఒ చుట్టూ సీనియర్ జెఎల్స్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల సీనియారిటీ గుర్తింపులో గూడుపుఠాణి నడుస్తోంది. ప్రభుత్వం ఇటీవల కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల సీనియారిటీని గుర్తించాలని ఆదేశాలు జారీ చేసింది. గురుకుల పాఠశాలల ద్వారా కడప జిల్లా కో-ఆర్డినేటర్ కడప, అన్నమయ్య జిల్లా పరిధిలోని 24 గురుకుల పాఠశాలల పరిధిలోని జూనియర్ లెక్చరర్ల సీనియారిటీ గుర్తింపు ప్రక్రియను చేపట్టింది. కొంత మంది గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్లతో కమిటీని ఏర్పాటు చేసింది. ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్ల ద్వారా జూనియర్ లెక్చరర్ల సీనియారిటీ వివరాలను సేకరించింది. పులివెందుల గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ సీనియర్ లెక్చరర్ ఉన్నప్పటికీ జాబితాలో చూపించకుండా జూనియర్ వెనకేసుకుని రావడం, పిఎస్ సబ్జెక్టును బోధించాలని ఆదేశించడం వెనుక మతలబేమిటో తెలియడం లేదు. జెఎల్ సీనియారిటీ గుర్తింపులో అవకతవకలు ఉన్నాయని డిసిఒకు స్పష్టంగా తెలిసినప్పటికీ మిన్నకుండిపోవడం వెనుక కుమ్మక్కు రాజకీయం నడుస్తోందనే విమర్శలు ఉన్నాయి. లక్కిరెడ్డిపల్లె గురుకుల ప్రిన్సిపల్ సీనియర్ జెఎల్‌కు ప్రాధాన్యత ఇవ్వగా, పులివెందుల ఇన్‌ఛార్జి గురుకుల ప్రిన్సిపల్‌తో కలిసి సీనియారిటీని నిర్లక్ష్యం చేయడం ఏమిటనే వాదన వినిపిస్తోంది. అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం ఆదర్శపాఠశాలలోని గురుకులంలో గణిత జూనియర్ లెక్చరర్ కొరత కారణంగా ప్రిన్సిపల్ గణిత సబ్జెక్టు బోధన, అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలను చూసుకోవాల్సి వస్తోంది. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఓ జెఎల్‌ను బద్వేల్‌కు బదిలీ చేయడం వెనుక తన, పర అనే పక్షపాతం చూపారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం పదవ తరగతి, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ సైతం విడుదల చేసిన నేపథ్యంలో గురుకుల పాఠశాలల్లో సీనియారిటీ ఆధారంగా జెఎల్ పోస్టింగ్స్ ఇచ్చి మెరుగైన ఫలితాలు సాధించాల్సిన సమయంలో సీనియారిటీ లొల్లితో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడం ఏమిటో తెలియని విమర్శలు ఉన్నాయి. కలెక్టర్ జోక్యం చేసుకుని సీనియారిటీ గుర్తింపులో దొర్లిన అవకతవకలను సరిదిద్ది వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది.

సీనియారిటీ ఇబ్బందులు వాస్తవమే

జూనియర్ లెక్చరర్ల సీనియారిటీ లిస్టు ప్రక్రియను పూర్తి చేశాం. నాలుగు, ఐదు చోట్ల సీనియారిటీ ఆధారంగా భర్తీ చేయడంలో ఇబ్బందులు ఉన్నాయి. పోర్టల్‌లో టీచర్లను సైతం రిలీవ్ చేశాం.

- ఉదయశ్రీ, బి.ఆర్.గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్, కడప.

సీనియర్ జెఎల్ల తరుపున ఉద్యమిస్తాం

జెఎల్ సీనియారిటీ గుర్తింపులో అన్యాయం చేస్తే ఉద్యమిస్తాం. సీనియర్ అధ్యాపకుల స్థానంలో జూనియర్ అధ్యాపకులను ఉంచడం తగదు. గణితం బోధించే జెఎల్‌కు పిఎస్‌ను బోధించాలని ఆదేశించడం సరికాదు. దీని ప్రభావం వార్షిక ఫలితాలపై పడే ప్రమాదం ఉంది.

- వి.రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కడప.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్

పిఎం స్వనిధి పథకం ద్వారా వీధి వ్యాపారులకు ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తుందని కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం కడప నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పిఎం స్వనిధి పథకం కింద అర్హత సాధించిన వీధి వ్యాపారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ పిఎం స్వనిధి పథకం ద్వారా చిన్న, వీధి వ్యాపారులకు ఆర్థికంగా సహకారం అందిస్తూ, వారి జీవనోపాధి అభివృద్ధి దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. వ్యాపారులకు అందించిన చెక్కులు వారి వ్యాపారం విస్తరణకు, స్వయం సమర్థత సాధించేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. అర్హులైన ప్రతి వ్యాపార కుటుంబం ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా కలెక్టరేట్, మున్సిపల్ శాఖ, బ్యాంకింగ్ వ్యవస్థ సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. వ్యాపారం కోసం అప్పులు తీసుకుని వడ్డీలు కట్టలేక అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతో పథకం ద్వారా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ కిరణ్ కుమార్, వివిధ బ్యాంకుల మేనేజర్ లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని బాలాజీ వెంచర్‌ను తొలగించాలి

ప్రజాశక్తి - కడప

అనుమతులు లేని బాలాజీ వెంచర్‌ను తొలగించాలని కోరుతూ గురువారం ఎఐసిసి కో- ఆర్డినేటర్ ఎస్.ఎ.సత్తార్ కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని చిన్న చౌకు గ్రామ పొలం, రామాంజనేయ పురం, జర్నలిస్టు కాలనీలో సర్వేనెంబర్.424/4 సి లో 4.22 ఎకరాల భూమిలో వంక కాలువను మూసివేసి బాలాజీ డెవలపర్స్ పేరిట కెఎంసి అనుమతులు లేకుండా వెంచర్ వేశారని చెప్పారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు మూసివేసిన కాలువ ఆక్రమణ తొలగించటం, తరువాత మళ్లీ మూసివేయడం జరుగుతూనే ఉందని చెప్పారు. ఈ ఏడాది జులై 7న వివిధ రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాలతో ఏర్పడిన అఖిలపక్ష కమిటీ కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా మూసివేసిన కాలువను మళ్ళీ పునరుద్ధరించారని చెప్పారు. ఇలా పదేపదే జరుగుతూ ఉంది అని తెలిపారు. ఈ విషయమై కెఎంసి అధికారులకు కూడా తెలియజేశామన్నారు. అందుకు బాలాజీ డెవలపర్స్ వెంచర్‌కు కెఎంసి తరపున ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదని చెప్పారు. అనుమతులు లేని, వంక కాలువను ఆక్రమించిన బాలాజీ డెవలపర్స్ వెంచర్‌ను వెంటనే తొలగించాలని కమిషనర్‌ను కోరామని చెప్పారు. కమిషనర్ స్పందిస్తూ విచారించి అనుమతులు లేని ఆక్రమణలన్నీ తొలగిస్తామని తెలిపారు.

ఎస్‌పికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న మధురెడ్డి

ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనా నేతృత్వంలో రహదారులపై రోడ్డు ప్రమాదాలు చేసుకోకుండా నిర్వహిస్తున్న 'ఫేస్ వాష్ అండ్ గో' ఎంతో మంచి కార్యక్రమమని ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ఎస్‌పికి కృతజ్ఞతలు అని కాంగ్రెస్ యువనేత వెన్నపూస మధురెడ్డి పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఎస్‌పికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని రహదారులపై 'బ్లాక్ స్పాట్స్' గుర్తించి, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుడా ముందస్తు చర్యలలో భాగంగా పోలీసు అధికారులు తమ సిబ్బందితో అర్ధరాత్రి దాటాక లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లు, తదితర వాహనాల డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకునటువంటి పోలీసు అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు : వైసిపి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న పి. రవీంద్రనాథ్‌రెడ్డి

18 నెలల టిడిపి కూటమి పాలనలో రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదని, ప్రజల సంక్షేమం లేదని, అప్పులు మాత్రం రూ. 2.27 లక్షల వేల కోట్లు కూటమి ప్రభుత్వం చేసిందన్నారు. ప్రజల సంక్షేమాన్ని, రైతులను పూర్తిగా ఈ విస్మరిచ్చిందని పేర్కొన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా అభివృద్ధి, సంక్షేమం పట్ల దృష్టి సారించకుండా దోచుకోవడం, దాచుకోవడమే పనిగా చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని వాపోయారు. రాష్ట్రంలో అన్ని రంగాలను అమ్మకానికి పెట్టారన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందిం చాలని చెప్పారు. పులివెందుల మెడికల్ కళాశాలలో పరిక˜రాలను తరలిం చడం దారుణమన్నారు. విలేకరుల నాయకులు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పాకా సురేష్, ప్రసాద్‌రెడ్డి, పులి సునీల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

శిబిరాలతో ఆత్మవిశ్వాసం

ప్రజాశక్తి - కడప

ఎన్‌సిసి కేడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపల్

విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధిలో, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడంలో అడ్వెంచర్ క్యాంపులు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్. జి.రవీంద్రనాథ్ అన్నారు. నవంబర్ నెల 10 నుంచి 21 వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో నిర్వహించబోయే రాక్ క్లైమ్బింగ్ క్యాంపునకు ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపికైన ఎన్‌సిసి కేడెట్లు సయ్యద్ అలీ, మహమ్మద్ లను గురువారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ శారీరక దృఢత్వానికి అడ్వెంచర్ క్యాంపులు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ మహేష్, కేడెట్లు పాల్గొన్నారు.

'వెలుగు'తోనే మహిళాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలో డ్వాక్రా మహిళలు వెలుగు బతుకమ్మ ద్వారా ఎంతో అభివృద్ధి చెందుతున్నారని ఎపిఎం అనంతయ్య పేర్కొన్నారు .గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య 17వ వార్షిక మహాసభ నిర్వహించారు. సమావేశంలో ఎపిఎం మాట్లాడుతూ 2024- 25 ఆర్థిక సంవత్సరంలో మండల సమాఖ్యలో సిఐఎఫ్ లోన్స్ రూ. 26 లక్షలు బ్యాంకు లింకేజీ లోన్లు రూ.19.50 కోట్లు, ఉన్నతి లోన్లు రూ. 35.28 లక్షలు గ్రామ సంఘాలలోని ఎస్ఎస్‌జి మహిళలకు అందిస్తున్నామని చెప్పారు. మండల సమాఖ్య రూ. 96,500 ఆదాయంలో ఉందని పేర్కొన్నారు. మహిళలు రుణాలు తీసుకున్న సక్రమంగా ప్రతినెలా కంతుల వారీగా చెల్లించినట్లయితే వడ్డీ కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ఇంకా వారికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ఎంతో సహాయపడతాయని ఎతలిపారు. ఈ విషయం ప్రతి డాక్రా మహిళ గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహాసభలో కాశినాయన మండల సమాఖ్య నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులుగా, ఎం అంజలి, ఉపాధ్యక్షురాలుగా కె. పుష్పలత, కార్యదరిగా మహబూబ్ చాంద్, కోశాధికారిగా ఏం రాజేశ్వరి, సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వెలుగు సిసిలు ఎ. సిద్ధయ్య, సునీల్ కుమార్, ప్రతాప్, సుదర్శన్, అకౌంటెంట్ రాజశేఖర్, 28 గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న మండల సమాఖ్య

నేడు కడపకు శ్రీచరణి

- నగరంలో ర్యాలీ, ఏసిఏ స్టేడియంలో ఘన సత్కారం

ప్రజాశక్తి-కడప

క్రికెట్‌లో సత్తాచాటి కడప ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో నిలబెట్టిన మన ముద్దుబిడ్డ శ్రీచరణి ఈ నెల 7న కడపకు రానున్నారు. ప్రపంచ క్రికెట్ కప్‌లో క్రీడా అణిముత్యంగా నిలిచిన ఆమెకు ఘనస్వాగతం పలికేందుకు ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ సౌజన్యంతో కడప జిల్లా క్రికెట్ అసోషియేషన్ భారీ ఏర్పాట్లు చేసింది. కడప నగరమంతా విజయోత్సాహంలో ఉన్న శ్రీచరణి పోస్టర్లు వెలిశాయి. కడప గడపలో శిక్షణ పొంది ఐదేళ్ల కాలంలోనే భారత జట్టులో స్థానం సంపాదించేందుకు తెరవెనుక కృషి చేసిన కడప జిల్లా క్రికెట్ అసోషియేషన్, ఆంధ్ర క్రికెట్ ఆసోషియేషన్ అంతే బాధ్యతగా ఘనంగా సత్కరించుకోనున్నారు. సాయంత్రం 4.30 గంటల నుంచి హెడ్ పోస్టాఫీసు, ఏడు రోడ్లు, ఎన్‌టిఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్‌మార్గ్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించేందుకు సన్నహాలు పూర్తయ్యాయి. అనంతరం ఏసిఏ స్టేడియంలో సాయంత్రం 6.30 గంటలకు ఘనంగా సత్కరించనున్నారు. జిల్లా ఖ్యాతి ప్రపంచ స్థాయిలో నిలబెట్టిన శ్రీచరణితో క్రికెట్ అసోషియేషన్‌కు ఉన్న అనుబంధాన్ని పంచుకోనున్నారు. కార్యక్రమంలో కడప నగరానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. శ్రీచరణికి జిల్లా క్రీడాభిమానులు ఘనస్వాగతం పలికి కార్యక్రమం విజయవంతం చేయాల్సిందిగా క్రికెట్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.భరత్‌రెడ్డి, ఎ.రెడ్డిప్రసాద్ కోరారు.

ప్రతి గ్రామానికీ సురక్షితమైన తాగునీరు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లాలో ఏ గ్రామంలో కూడా తాగునీటి కొరత రాకుండా ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న శుద్ధ తాగునీటి సరఫరా, పరిశుధ్య పనుల పురోగతిపై తాగునీరు, పారిశుధ్య మిషన్ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా శుద్ధ తాగునీటి సరఫరా అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కుళాయి కనెక్షన్లను పూర్తి స్థాయిలో నిర్వహణలోకి వచ్చేలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి పథకాల అమలు పనితీరును మెరుగు పరిచేందుకు క్రమం తప్పకుండా తాగునీటి నాణ్యతా పరీక్షలను నిర్వహించాలని క్షేత్రస్థాయి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పులివెందుల వాటర్ గ్రిడ్ ద్వారా నియోజకవర్గంలోని అన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరు అందేలా పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా పనులను పూర్తి చేసేలా దృష్టి సారించాలని పేర్కొన్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు ఎలాంటి కొరత లేకుండా తాగునీటి సదుపాయం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. అన్ని గ్రామపంచాయతీల్లో క్లోరినేషన్ సిస్టమ్‌ను, ఎఫ్‌టికె పనితీరు, నాణ్యతను ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా తాగునీరు కలుషితతమైనట్లు సమాచారం అందితే సంబంధిత అధికారులపై శాఖ పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. తాగునీటి సరఫరా, డ్రెయినేజీ సిస్టమ్ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని రకాల పిడబ్ల్యుఎస్, ఎంపిడబ్ల్యుఎస్, డిపి స్కీములు, సిపిడబ్ల్యుఎస్ స్కీముల నిర్వహణను పటిష్టం చేయాలన్నారు. ప్రతి ఒక్క ఇంటికీ మంచినీటి కుళాయి కనెక్షన్లను ఎక్కడా లీకేజీలు లేకుండా సరఫరా చేపట్టాలన్నారు. సమావేశంలో పులివెందుల ఆర్‌డిఒ చిన్నయ్య, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, డిపిఒ రాజ్యలక్ష్మి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఏడుకొండలు, ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ రమణ, పంచాయతీరాజ్, డిఆర్‌డిఎ, మెప్మా, వ్యవసాయ శాఖ, ప్రజారోగ్య శాఖ, భూగర్భజలాలు, ఫారెస్ట్ సబ్ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలను జాగృతం చేయడమే పిఎన్ఎం లక్ష్యం

ప్రజాశక్తి-కడప అర్బన్

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్

ప్రజలను జాగృతం చేయడమే ప్రజా నాట్య మండలి ముఖ్య లక్ష్యమని రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. గురు వారం ప్రజా సంఘాల కార్యాలయంలో విలేక రుల సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని యుటిఎఫ్ భవన్‌లో ఈనెల 7,8,9 శిక్షణ తరగతులు నిర్వహించనున్నామి చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి కళాకారులు 200 మంది హాజరవుతున్నారని తెలిపారు. 'కళ కళ కోసం కాదు.. ప్రజల కోసం.. ప్రగతి కోసం" అనే లక్ష్యంతో ప్రజానాట్యమండలి ప్రజలందరినీ చైతన్యం చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలకు, కష్టాలకు కారకులైన పాలకుల విధానాలను తేటతెల్లం చేస్తూ ప్రజలను చైతన్యపరిచే కళారూపాలు ప్రజానాట్యమండలి రూపొంది స్తుందన్నారు. ప్రత్యామ్నాయ ప్రజా సాంస్కృతిక ఉద్యమం కోసం ప్రజల్లో ఉన్న ఔత్సాహిక కళాకారులను ప్రజల కోసం పనిచేసే ప్రజా కళాకారులుగా తీర్చిదిద్దే కార్యక్రమం ప్రజానాట్యమండలి చేపట్టిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రజలపై పెద్ద ఎత్తున భారాలు మోపుతూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందన్నారు. ఒకవైపు కార్పొరేట్ దోపిడీ, మరొకవైపు మతం పేరుతో ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చేటువంటి ప్రయత్నం జరుగుతుందని ప్రజలు అప్రమత్తమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 8న సాయంత్రం 6 గంటలకు ఐటిఐ సెంటర్‌లో ప్రజా కళాకారుల 'ఆట పాట మాట' కార్యక్రమం ఉంటుందని చెప్పారు. నగరంలోని ప్రజలందరూ కార్యక్రమాల్ని తిలకించి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ప్రజా రచయిత జె.బాల చెన్నయ్య, జిల్లా నాయకులు రమణ, ఎన్.హరికృష్ణ, వ్య.కా.స.జిల్లా కార్యదర్శి వి.అన్వేష్, కెవిపిఎస్ నగర కన్వీనర్ నరసింహ పాల్గొన్నారు.

సస్పెండ్ చేయడం సరికాదు

ప్రజాశక్తి- కలసపాడు : రాష్ట్ర వ్యాప్తంగా రైతు సేవాకేంద్రాలలో పనిచేస్తున్న సచివాలయ సిబ్బందికి రావాల్సిన బిల్లులు దారి తప్పడంపై ప్రశ్నించినదుకు వైస్సార్ ఖాజీపేట మండలం, రావులపల్లె సచివాలయ ఉద్యాన సహాయకులు సురేంద్రను సస్పెండ్ చేయడం సరికాదని యునైటెడ్ వెల్ఫేర్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఒక రైతు భరోసా కేంద్రాన్ని తీసుకొచ్చి అందులో స్టేషనరీకి మెయింటెనెన్స్‌కు నెలకు రూ. 2048, సాయిల్ శాంపుల్స్ కోసం ఒక్కో సాంపిల్స్‌కు రూ. 50 చొప్పున రెండేళ్లకుగాను ఒక్కొక్క రైతుసేవా కేంద్రానికి రూ.12 వేలుచెల్లించాల్సి ఉంద న్నారు. పంట కోత ప్రయోగానికి ఒక్కొక్కరికి రూ. 5వేలు, క్రాప్ బుకింగ్ చేసినందుకుగాను సర్వే నెంబర్‌కు రూ.10 చొప్పున రావాల్సిన డబ్బుల్ని ఆర్‌బికె స్థాయి ఉద్యోగులకు ఇవ్వకుండా ప్రస్తుత ప్రభుత్వం మోసం చేయడం ఏమిటని ప్రశ్నించారు. మండల స్థాయి నుంచి కమిషనర్ స్థాయి వరకు దాదాపు రూ. 200 కోట్లు పైగా దుర్వినియోగం అయ్యాయని ఉద్యాన సహా యకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న సురేంద్ర ఆర్‌టిఎ యాక్టు ద్వారా సమాచారం తెపించి, ఐదు నెలలుగా అన్ని జిల్లాల కలెక్టర్లకు, కమిషనర్లకు, మంత్రులకు, సిఎం దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. అధికారులు చేసే అరాచకాలు ఆర్‌టిఎ రూపంలో ప్రశ్నించినందుకు, వారి చేసే తప్పిదాలను ఎత్తిచూపుతూ న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తే ఎటు వంటి ముందస్తు నోటీసులు లేకుండా నేరుగా సస్పెన్షన్ ఇవ్వడం సమంజసం కాదని చెప్పారు.

పొలాలకు విద్యుత్ తీగలు తగిలించరాదు

ప్రజాశక్తి-కాశినాయన

17 గ్రామ పంచాయతీలలోని రైతులు తమ పొలాలకు అడవి పందులు వస్తున్నాయని విద్యుత్ తీగలు తగిలించరాదని నరసాపురం సబ్ ఇన్‌స్పెక్టర్ యోగేంద్ర తెలిపారు గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొన్ని గ్రామాలలో దండోరా వేయించారు. గ్రామాలలో రైతులు పొలాలకు కరెంటు తరలించడం వల్ల ప్రజలు కూడా చనిపోతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల రాత్రి సమయాలలో గ్రామాలలో కరెంటు కూడా పోతుందన్నారు. ప్రజలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందన్నారు. ఈ విషయం రైతులు గమనించి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు అటవీ జంతువులకు కూడా ప్రాణహాని కల్గుతుందన్నారు.

కేక్ కట్ చేస్తున్న శ్రీధర్, మన్సూర్ అలీఖాన్, రహమతుల్లా

ఎన్ఆర్ఐల సంక్షేమానికి కృషి

టిడిపి ఎన్ఆర్ఐ కువైట్ ఉపాధ్యక్షులు రహమతుల్లా

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్ఆర్ఐ సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని టిడిపి ఎన్ఆర్ఐ కువైట్ ఉపాధ్యక్షులు షేక్.రహమతుల్లా పేర్కొన్నారు. గురువారం కడప ఎన్ఆర్ఐ కార్యాలయంలో మొదటి వార్షికోత్సవ సంబరాలు టిడిపి నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అందరికీ స్వీట్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా గిడ్డంగుల శాఖ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ మురికినాటి శ్రీధర్, టిడిపి నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నియోజకవర్గంలో ఎన్ఆర్ఐ కార్యాలయం ఏర్పాటు చేసి మొదటి వార్షికోత్సవం చేసుకోవడం హర్షణీయమన్నారు. టిడిపి ఎన్ఆర్ఐ కార్యాలయం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా ప్రజానీకం వృత్తిరీత్యా వెళ్లి గల్ఫ్ దేశంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారని పేర్కొన్నారు. కడప జిల్లా వాసులను తమ స్వస్థలాలకు వచ్చేందుకు తనవంతు సహాయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి గల్ఫ్ బాధితుల సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నామని తెలిపారు. వారి స్ఫూర్తితో పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి సహకారాలతో గల్ఫ్ బాధితులను వారి సొంత ఊర్లకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా వచ్చేందుకు ఏర్పాట్లు చేయడం చాలా సంతోషకరమన్నారు. తెలుగుదేశం పార్టీలో ఉంటూ ఇటు కడప నియోజకవర్గంలో, అటు గల్ఫ్ దేశమైన కువైట్‌లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపటిట్ట తెలుగుదేశం పార్టీ బలోపేతానికి మరింత కృషి చేసిన కువైట్ ఎన్ఆర్ఐ షేక్ రహ్మతుల్లా కి శుభాకాంక్షలు తెలిపారు. గల్ఫ్‌లో ఇబ్బందులు పడుతున్న బాధితులకు తనవంతు సహాయ సహకారాలు అందించడానికి మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, నాలుగో డివిజన్ యూనిట్ ఇన్‌ఛార్జి ఆవుల వెంకటేష్, తెలుగు మహిళా నగర అధ్యక్షులు మురికినాటి సునీత, 2వ డివిజన్ టిడిపి సీనియర్ నాయకులు మురికినాటి రామాంజనేయులు, 28వ డివిజన్ ఇన్‌ఛార్జి గాజులపల్లి రాఘవేంద్ర, 34వ డివిజన్ ఇన్‌ఛార్జి షేక్.జవీద్, టిడిపి నాయకులు మలిశెట్టి చంద్రశేఖర్, సుధాకర్ రెడ్డి,ఏ.వి.లోకేష్ వంకేల ఆనందరావు, పెటేటి నరసింహా, విశ్వనాథ్, అనిల్,షేక్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఉరుసులో అన్నదానం

ప్రజాశక్తి-కడప అర్బన్

అన్నదానం చేస్తున్న మేయర్ ముంతాజ్‌బేగం

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కడప అమీన్ పీర్ దర్గా ఉరుసు ఉత్సవాల సందర్భంగా వికాస్ విద్య సంస్థల చైర్మన్ సుభాన్ బాషా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, మాజీ మేయర్ సురేష్ బాబు, మేయర్ ముంతాజ్ బేగం హాజరయ్యారు. భక్తులకు అన్నదాన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులామతాలకు అతీతంగా ఉరుసు ఉత్సవాలలో పాల్గొనే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మదనపల్లి వైసిపి ఇన్‌ఛార్జి నిసార్ అహ్మద్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు అలీ అక్బర్, షంషీర్, చాక్లెట్ అరిపుల్లా, డిష్ జిలాన్, కరస్పాండెంట్ సుల్తాన్ బాబా, మైనుద్దీన్, ఆరీఫ్ , షఫీ, షాబు, జావిద్, ఫజల్, మియా పాల్గొన్నారు.

బాధితురాలు గంగాదేవితో టిడిపి నేతలు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని రాజీవ్‌నగర్‌లో ఉంటున్న గంగాదేవి అనే బాధి తురాలికి టిడిపి నుండి రూ.5 లక్షలు మంజూరైనట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. ఆంజనేయులు అనే వ్యక్తి ఇటీవల ఆటో ప్రమాదంలో మృతి చెందాడు. అతనికి టిడిపిలో సభ్యత్వం ఉండడం వల్ల ఆంజనేయులు కుటుంబ సభ్యులకు ఆ మొత్తం మంజూరైందని రామమునిరెడ్డి తెలిపారు. గురువారం ఆంజనేయులు సతీమణి గంగాదేవికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి మండల పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, ప్రధాన కార్య దర్శి మహమ్మద్ ఇనాయతుల్లా, మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, జబిబుల్లా, డక్కా రమేష్, నాయక్, తక్కెల షరీఫ్ పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని లోకేష్‌కు వినతి

వేంపల్లె : వేంపల్లె మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి కోరారు. విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను బుధవారం రాత్రి రామమునిరెడ్డి కలిశారు. వేంపల్లె మండలంలో ఉన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రోడ్డు వెడల్పు పనులు నెమ్మదిగా జరుగుతుండడంతో వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. పనులు వేగవంతంగా జరిగేందుకు నిధులు ఎక్కువగా విడుదల చేయాలని కోరారు. జిఎన్ఎస్ఎస్ ద్వారా ముచ్చుకొన చెరువు మీదుగా పాపాగ్ని నదికి నీటిని విడుదల చేయాలని కోరారు. తద్వారా కమలాపురం వరకు సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు ఉండవని ఆయన లోకేష్‌కు వివరించారు. పంచాయతీ ఎన్నికల్లో పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవి సారథ్యంలో నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగుర వేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం ప్రత్యేకదృష్టి పెట్టామని మంత్రి లోకేష్ చెప్పినట్లు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి పాలక మండలి కృషి చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

శ్రీవృషభాచలేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పాలక మండలి సభ్యులు కృషి చేయాలని దేవస్థానం ఇఒ హనుమంతరావు కోరారు. గురువారం స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో దేవస్థానం చైర్మన్ పివి రమణ అధ్యక్షతన పాలక మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనులపై చర్చించారు. దేవస్థానం చైర్మన్ పివి రమణ మాట్లాడుతూ ఎద్దుల కొండపైన ఆంజనేయస్వామి ఆలయం, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో నిత్య ప్రసాదాలు పంపిణీతోపాటు ప్రతి రోజూ విశేష పూజా కార్యక్రమాలు ప్రారంభించే విధంగా పాలక మండలి సభ్యులు తీర్మానించామన్నారు. ఎద్దుల కొండపై ప్రాకారం, రాజగోపురం నిర్మాణం, బండసప్పట వంటి అభివృద్ధి పనులను త్వరలో చేపడుతామన్నారు. పాలక మండలి సభ్యుల తీర్మానం మేరకు పనులు చేపట్టేందుకు దేవదాయ ధర్మదాయశాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

సిఎ విద్యార్థి అర్చనారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణి రెడ్డి అన్నారు. వేంపల్లె శ్రీచైతన్య ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి బొమ్మిరెడ్డి అర్చనారెడ్డి సిఎ అర్హత సాధించిన సందర్భంగా గురువారం శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో చక్రపాణిరెడ్డి, ఉపాధ్యాయులు ఆమెను సత్కరించారు. విద్యార్థిని మొదటి నుండి నిరంతర కృషి, క్రమశిక్షణతో ముందుకు సాగి సిఎ అర్హత సాధించడం పాఠశాలకు గర్వకారణమని కరస్పాండెంట్ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. తమ కుమార్తె విజయానికి పాఠశాల బోధన, ఉపాధ్యాయుల మార్గ దర్శకత్వం ముఖ్య కారణమని విద్యార్థిని తల్లిదండ్రులు రాఘవరెడ్డి, అరుణ పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

వేంపల్లె : వేంపల్లెలో ఉన్న ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో–ఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదా పీర్ కోరారు. గురువారం పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డికి ఆప్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని పలు సమస్యలను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తెచ్చారు. ప్రజల ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో ఆప్ మండల సభ్యులు పీరు బాషా, షఫీ, ఎస్ఎండి గౌస్, ఖదీర్, సమీర్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి పోటీతత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి విద్యార్థి పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో గత నెల 11న బాలికల దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు వార్త పత్రికలను సమగ్రంగా చదవాలన్నారు. తద్వారా జాతీయ, అంతర్జాతీయ, స్థానిక సమాచారం క్షుణ్ణంగా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు వెంకటలక్ష్మి, వసంత కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - లింగాల

బాలికల దినోత్సవం పురస్కరించుకొని మండల పరిధిలోని అన్ని హైస్కూళ్లలో ఐసిడిసి సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీదేవి ఆధ్వర్యంలో గత నెల 11న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలో పత్తూరు సమీపాన కడప–కర్నూలు బైపాస్ జాతీయ రహదారిపై నాగపట్నం వెళ్లే దారి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని కమలాపురం భీమరాజు (35) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు సీతానగరం గ్రామానికి చెందిన భీమరాజు వ్యక్తిగత పని నిమిత్తం గురువారం ఖాజీపేట నుంచి స్వగ్రామం సీతానగరానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. హైవే దారిని దాటుకుంటుండగా ఈ ఘటన జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

అదుపుతప్పి ఆటో బోల్తా : ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి - వేముల

కడప–పులివెందుల ప్రధాన రహదారిపై స్థానిక అమ్మయ్యగారిపల్లి గ్రామం సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న వారు అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ఇల్లూరు గ్రామానికి చెందినవారు. వీరు పోలతల దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో వస్తుండగా అమ్మయ్యగారిపల్లె వద్ద ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి డివైడర్‌పై బోల్తా పడింది. ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనం ద్వారా వేంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

మైదుకూరు అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ప్రజాశక్తి - మైదుకూరు టౌన్

మైదుకూరు మున్సిపాలిటీ అభివృద్ధే తన లక్ష్యమని, ఆదర్శవంతంగా తీర్చిదిద్ది రాష్ట్రంలోనే ప్రథమంగా నిలుపుతామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ సమావేశాన్ని గురువారం చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ, ఎక్కువ నిధులను మైదుకూరు మున్సిపాలిటీకి తెప్పిస్తున్నామన్నారు. వీధుల్లో డ్రెయినేజీ, వీధిలైట్లు, తాగునీరు సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజల ఆకాంక్ష మేరకు తాను పనిచేస్తానని పుట్టా తెలిపారు. అధికారులు విధుల్లో అలసత్వం వహించరాదన్నారు. చైర్మన్ మాచనూరు చంద్ర మాట్లాడుతూ అజెండాలో వార్డుల వారీగా సమానంగా చేపట్టిన అభివృద్ధి పనులపై కౌన్సిలర్లకు వివరించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో మాచనూరు చంద్ర చర్చించారు. సమావేశంలో పురపాలక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలి

చాపాడు (మైదుకూరు) : సిమెంట్ రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ తెలిపారు. గురువారం మైదుకూరు మున్సిపాలిటీలోని 18వ వార్డులోని ఆనుకుంటలో రూ.18 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు నాణ్యతలో రాజీ పడొద్దని, పనులను నిత్యం పర్యవేక్షించాలని ఎఇ నిరంజన్ రెడ్డికి సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. త్వరలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. అత్యవసరం అనుకున్న ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీ కాలువలు నిర్మిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల నివాసముంటున్న స్థానికులు తమ వీధుల్లో కూడా సీసీ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, రాష్ట్ర వేతన కమిటీ డైరెక్టర్ దాసరి బాబు, 18వ వార్డు టిడిపి ఇన్‌చార్జి ధనపాల రవి, ప్రశాంతి, టిడిపి నాయకులు ధనపాల జగన్, యాపరాల చిన్న, మేకల చిన్న, బండి అమర్నాథ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బిఎన్ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

కక్షపూరిత చర్యలకు పాల్పడటం తగదు

తొలగించిన నిమ్మ చెట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కూటమి నాయకుల వత్తిడితో వైసిపి నాయకులు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రం, కోళ్ల ఫారంను రెవెన్యూ అధికారులు తొలగించడం అన్యాయమని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన మండల పరిధిలోని పి.బొమ్మేపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా పిఆర్ మాట్లాడుతూ మూడేళ్ల వయసున్న నిమ్మ చెట్లను, కోళ్ల ఫారంను ధ్వంసం చేయడం కక్షపూరిత చర్య అన్నారు. గ్రామాల్లో రైతులపై కక్షపూరిత చర్యలకు పాల్పడితే రాబోయే రోజుల్లో కూటమి నాయకులు తప్పక మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. రైతులకు, కార్యకర్తలకు నష్టం కలిగించే విష యాలు, పనులను గానీ ప్రోత్సహిస్తే సహించేది లేదన్నారు. ఇబ్బందులకు గురైన నాయకులకు, కార్యకర్తలకు వైసిపి ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులతో మమేకమై కోటి సంతకాల సేకరణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ప్రతాప్‌రెడ్డి, గూడెంచెరువు వైసిపి నేత నాగేశ్వరరెడ్డి, మల్కిరెడ్డి హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

జగన్ అధికారంలోకి వస్తే 'ఆది' రాజకీయ భవిష్యత్ అధోగతే

వచ్చే ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వస్తే ఆదినారాయణరెడ్డికి రాజకీయ భవిష్యత్తు అధోగతి అవుతుందని వైసిపి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆదినారాయణ రెడ్డి తనస్థాయిని మరిచి మాట్లాడుతున్నారన్నారు. మాట్లాడే విధానం, పద్ధతి మార్చుకోకపోతే భవిష్యత్తు ఉండదని తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్ చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం 18 నెలలకే రూ.2.40 లక్షల కోట్లు అప్పు చేసిందని తెలిపారు. వివేక హత్య కేసులో ఎవరు తప్పు చేసినా వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని పిఆర్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి ప్రభుత్వానికి ధైర్యం ఉంటే స్వేచ్ఛగా, రాజ్యాంగబద్ధంగా జరిపించాలని కోరారు. ప్రజలు ఎలా ఎవరికి బుద్ధి చెప్తారో చూడాలన్నారు. కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, గిరిధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, హనుమంత్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవే పరమార్థంగా వృద్ధాశ్రమం ఏర్పాటు

బృందా వృద్ధాశ్రమం నిర్వాహకులు అట్లూరి బాలసుబ్బయ్య, సుధారాణి దంపతులు

ప్రజాశక్తి - కడప

వృద్ధాశ్రమంలో సేద తీరుతున్న అనాథలు

వృద్ధాప్యంలో ఉన్నతల్లిదండ్రులను పట్టించుకోకుండా గాలికి వది లేసిన కుమారులు, కుమార్తెలున్న ప్రస్తుత రోజుల్లో సేవే పరమార్థంగా అలాంటివారికి సేవ చేసేందుకు వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేశామని బృందా వృద్ధాశ్రమం నిర్వాహకులు అట్లూరు బాలసుబ్బయ్య, సుధారాణి దంపతులు పేర్కొన్నారు. వారు వృద్ధాశ్రమ ఏర్పాటు ముఖ్య ఉద్దేశాన్ని ప్రజాశక్తికి వివరించారు. తమ పిల్లలు బాగుంటే చాలని ఏ తల్లి దండ్రులైనా అనుకుంటారని, ఎంతో కష్టపడి, ఇబ్బందులు ఎదుర్కొని పిల్లలను ఒక స్థాయికి తీసుకువచ్చిన తరువాత వారిని కొడుకులు, కుమార్తెలు నేడు విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. అనాథలుగా వదిలేసిన వారిని తాము అక్కున చేర్చుకుని ఆశ్రయం కల్పిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రుల కంటే ఎక్కువగా ప్రేమ చూపిస్తూ తాము ఉన్నామని మనోధైర్యాన్ని నింపుతున్నామని తెలిపారు. అనాథులుగా వృద్ధాప్యంలో ఉన్న వారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ సేవ చేయాలన్న దృక్పథంతో తమ కుమార్తె బృందా లక్ష్మి పేరున 2015వ సంవత్సరంలో చింతకొమ్మదిన్నె మండలం ఆజాద్‌నగర్‌లో కమ్యూనిటీ హాలులో 'బృందా వృద్ధాశ్రమం'ను ఏర్పాటు చేశామని వివరించారు. తమ ఆశ్రమంలో 25 మంది అనాథ వృద్ధులకు ఆశ్రయం కల్పించి వారి బాగోగులు చూసుకుంటున్నామని చెప్పారు. తాను గౌరవప్రదమైన న్యాయవాద వృత్తిలో ఉంటూ, కడప బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా కూడా పని చేశామని చెప్పారు. తన సతీమణి అట్లూరి సుధారాణి బికాం వరకు విద్యనభ్యసించారని చెప్పారు. తమకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారని తెలిపారు. అనాథ వృద్ధులను అక్కున్న చేర్చుకుని చేర్చుకొని వారికి ఆశ్రయం కల్పించడంతోపాటు మూడు పూటలా కడుపునిండా భోజనం పెట్టి వారికి ఎటువంటి లోటు లేకుండా చూసుకుంటున్నామన్నారు.

వృద్ధాశ్రమం ఏర్పాటుకు పునాది ఎలా అంటే..

తన చిన్న వయసులోనే తల్లిదండ్రులు చనిపోయారని బాలసుబ్బయ్య పేర్కొన్నారు. వారికి సేవ చేసే భాగ్యం తనకు కలగలేదని, తల్లిదండ్రులు లాంటి అనాథ వృద్ధులకు సేవ చేయాలన్న సంకల్పంతో తన కుమార్తె పేరున బృందా వృద్ధాశ్రమం ఏర్పాటు చేశానని చెప్పారు. తాను 7వ తరగతి చదివే సమయంలో నాన్న, 10వ తరగతిలో ఉన్నప్పుడు అమ్మ కూడా చనిపోయారని తెలిపారు. తమది పేద వ్యవసాయ కుటుంబమని, తల్లిదండ్రులు లేకపోయినా వారి ఆశీస్సులతో ఎన్నో కష్టాలు ఇబ్బందులు ఎదుర్కొని విద్యను అభ్యసించానని చెప్పుకొచ్చారు. కష్టపడి న్యాయవాద వృత్తిని చేపట్టాను. తల్లిదండ్రులు లేరు కాబట్టి ఒక ఆశ్రమం ఏర్పాటు చేసి అందులో ఉన్న వృద్ధులను తల్లిదండ్రులతో సమానంగా చూసుకోవచ్చు అన్న ఉద్దేశంతో "బృంద వృద్ధాశ్రమాన్ని" ఏర్పాటు చేశానని చెప్పారు. పదేళ్లుగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు సేవలందిస్తూ వారిలో తల్లిదండ్రులను చూసుకుంటున్నానని చెప్పారు. తన సతీమణి సుధారాణి తనకు ఎంతగానో సహాయ సహకారాలు అందిస్తూ ఆశ్రమంలో ఉన్న వృద్ధుల బాగోగులను దగ్గరుండి చూసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం, జిల్లా అధికారులు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తే చాలామంది అనాథ వృద్ధులకు ఆశ్రయం కల్పించి వారి బాగోగులను చూసుకుంటామని ఈ సందర్భంగా అట్లూరి బాలసుబ్బయ్య, అట్లూరి సుధారాణి దంపతులు అంటున్నారు.

పిల్లలతో అట్లూరి బాలసుబ్బయ్య, సుధారాణి, వడ్డిస్తున్న బాలసుబ్బయ్య, సుధారాణి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జె.చంద్రశేఖర్

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆరోగ్యానికి ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఏపీ కార్లలోని వ్యవసాయ క్షేత్రంలో రైతులకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల మంచి దిగుబడి రావడమే కాకుండా రసాయన రహిత పదార్థాలను ప్రజలకు అందించవచ్చు అన్నారు. శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీమ్ సురేష్, ఉష, మనోజ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్‌కు సహకరించొద్దు

ప్రజాశక్తి-చక్రాయపేట

సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్‌కు సహకరించవద్దని ఎస్ఐ జె.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆంజనేయపురంలో గురువారం ప్రజలు, వ్యాపారులను దేవాలయం వద్ద సమావేశపరిచి సైబర్ నేరగాళ్లు చేసే మోసాలపై వివరించారు. వారు అడితే ఒటిపి చెబితే మీ బ్యాంక్‌లో ఉన్న నగదు మాయమైపోతుందన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 378/2022

O@V.విజయభాస్కర్ రెడ్డి, S/o పీరారెడ్డి, హిందూ, 53 సంIIరాలు, డోర్‌నెం.3/820, అరవింద ఆశ్రమం, వైఎమ్ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. ...వాది

Vs

జి.శ్రీనివాసులు రెడ్డి, S/o నారాయణ రెడ్డి, హిందూ, 35 సంIIరాలు, డోర్ నెం.3/111, లెక్కలవారిపల్లె గ్రామం, గంజికుంట పోస్టు, మైదుకూరు మంII, కడప జిల్లా. ...ప్రతివాది

దావా సమను

పై నెంబరు దావాను వాది దావా బాకీ వసూలు కోరి దాఖలు చేసి ఉంటున్నారు. అట్టి దావాలో మీరు హాజరగుటకు గాను 5.1.2026వ తేదీన వాయిదా వుంటున్నది. సదరు వాయిదా నాడు మీరు ఉదయం 10.30 నిII, ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మాణించబడును.

వాయిదా తేది: 5.1.2026

//By Order of the Court//

జి.శ్రీనివాసులు, B.Com.,B.L.,
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 263/2021

ఎమ్. కనకదుర్గ, W/o ఉదయకుమార్, హిందూ, 36 సంII, డోర్‌నెం.3/1085–1, వైఎమ్ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. ...వాది

Vs

ఎస్.శ్రీధర్, S/o సుంఖయగుప్త, హిందూ, 45 సంIIలు, డోర్‌నెం.10–185–ఇ, కోనేటికాలవ వీధి, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. ...ప్రతివాది

దావా సమను

పై నెంబరు దావాను ప్రోనోటు బాకీ వసూలు కోరి దాఖలు చేసినారు. సదరు దావాలో మీరు హాజరువుటకు గాను 10.12.2025వ తేదీన వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా నాడు పై కోర్టులెఓ ఉదయం 10.30 ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలెను.లేని యెడల పరోక్షములో ఎక్స్‌పార్టీగా తీర్మాణించబడును.

వాయిదా తేది:10.12.2025

//By Order of the Court//

జి.శ్రీనివాసులు, B.Com.,B.L.,
అడ్వకేట్,
ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 46/2022

కె. ఈశ్వరయ్య, S/o బ్రహ్మయ్య, హిందూ, 60 సంIIలు, డోర్‌నెం.9/253, శ్రీరాములపేట, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. ...వాది

Vs

టి.శ్రీనివాసుల రెడ్డి, S/o వీరారెడ్డి, హిందూ, 58 సంIIలు, డోర్ నెం.8/56–1, శ్రీరాములపేట, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. ...ప్రతివాది

దావా సమను మరియు నోటీసు

పై నెంబరు దావాను ప్రోనోటు బాకీ వసూలు కోరి దాఖలు చేస్తు, ప్రతివాది యొక్క ఆస్థిని జప్తి కోరి I.A.No. 32/2022 నెంబరు పిటిషన్ దాఖలు చేసి ఉంటున్నారు. సదరు దావాలో మరియు పిటిషన్‌లో మీరు హాజరగుటకు గాను 15.12.2025వ తేదీన వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా నాడు పై కోర్టులో ఉదయం 10.30 ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మాణించబడును.

వాయిదా తేది:15.12.2025

//By Order of the Court//

జి.శ్రీనివాసులు, B.Com.,B.L.,
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

జగన్‌కు వివాహ పత్రిక ఇస్తున్న మురళి, నాయకులు

వివాహానికి జగన్‌ను ఆహ్వానించిన మురళి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల 23వ వార్డు ఇన్‌ఛార్జి కొంగనపల్లి మురళీమోహన్ (బండల మురళి) తన కుమారుడి వివాహానికి హాజరుకావాలని మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించారు. తాడేపల్లిలోని జగన్ కార్యాలయంలో గురువారం కలిశారు. కార్యక్రమంలో బండల మురళి తమ్ముడు కొండలరావు, పులివెందుల పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, వైసిపి, బలిజ సంఘ నాయకులు కడియాల లక్ష్మీనారాయణ, బలిజ సంఘం ఉపాధ్యక్షుడు హరి ఉన్నారు. డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ వినీత వివాహ వేడుకలు ఈనెల 26న జరగనున్న నేపథ్యంలో జగన్‌కు శుభలేక అందించి రావాలని కోరారు. ఇందుకు జగన్ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

ప్రభుత్వానికి కక్ష సాధింపు తగదు

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందులపై కూటమి ప్రభుత్వానికి కక్ష సాధింపు తగదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ వైద్య ఆరోగ్య కమిషన్ 2024–25 విద్యా సంవత్సరానికి పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు 50 ఎంబిబిఎస్ సీట్లు కేటాయిస్తూ 2024 ఆగస్టు 16న లెటర్ ఆఫ్ అనుమతి ఇచ్చిందన్నారు. ఆ సీట్లు వద్దని సిఎం చంద్రబాబు 2024 సెప్టెంబర్ 10న జాతీయ మెడికల్ కమిషన్‌కు లేఖ రాశారన్నారు. కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్ల 2024–25 విద్యా సంవత్సరానికి 50 సీట్లు, 2025–26 విద్యా సంవత్సరానికి 150 సీట్లు పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక అక్టోబర్ 11న పులివెందుల ప్రభుత్వ బోధనాసుపత్రిలో ఉన్న అధునాతనమైన వైద్య పరికరాలు బ్రాంకోస్కోప్, బెడ్స్,ఆటోక్లేవ్, స్లిట్ ల్యాంప్‌ను తరలించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ లేఖ రాశారన్నారు. ఈ నేపథ్యంలో పులివెందుల మెడికల్ కళాశాలలో ఉన్న పరికరాలను గుంటూరు, కర్నూలు, విజయవాడ ప్రభుత్వాసుపత్రులకు తరలించడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వ చర్యలు ఏమాత్రం సమంజసం కాదన్నారు. కూటమి ప్రభుత్వానికి కూడా పోయే కాలం దాపురించిదని తులసిరెడ్డి పేర్కొన్నారు.

సంతకాల సేకరణలో ప్రొద్దుటూరు ఫస్ట్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో నెల రోజులుగా నిర్వహించిన ఓటు దొంగ–గద్దె దిగు అవగాహన యాత్రకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా నేతృత్వంలో నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయిలో ప్రొద్దుటూరు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో, జిల్లాల వారీగా కడప జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం పార్టీ కార్యకర్తల కృషికి నిదర్శనమని ఇర్ఫాన్ బాషా పేర్కొన్నారు. విజయవాడలో పిసిసి అధ్యక్షురాలు షర్మిలను ఆయన గురువారం కలిశారు.

హుజూర్ నగర్ ఎడ్లు జాక్‌పాట్ కైవసం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ధరణి తిమ్మాయపల్లె గ్రామంలో అవధూత కొండయ్య స్వామి 44వ జన్మదిన వేడుకలలో భాగంగా గురువారం సీనియర్ (జాక్‌పాట్) విభాగంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహించారు. కొండయ్య స్వామి బండలాగుడు పోటీలను నిర్వహించారు. హుజూర్ నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి ఎస్ఎస్ఆర్ బుల్స్ 2455.05 అడుగుల లాగి మెదటి బహుమతి రూ.3 లక్షలు గెలుచుకున్నాయి. రెండవ బహుమతిని ప్రొద్దుటూరు చౌటపల్లెకు చెందిన మార్తల చంద్రఓబుల్ రెడ్డి, మేడిమాకులపల్లె తోట తిరుపాల్‌రెడ్డి ఎడ్లు 2418 అడుగులు లాగి రూ.2 లక్షలు గెలుచుకున్నాయి. విజేతలకు నగదు బహుమతిని కొండయ్య స్వామి అందజేశారు. జన్మదిన వేడుకల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోలాటం చెక్కభజన ఏర్పాటు చేశారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద పనులు వివిధ కారణాల చేత అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య కోరారు. ప్రొద్దుటూరు రోడ్డులోని స్థానిక జిల్లా పరిషత్ మార్కెట్ హైస్కూల్ పెండింగ్‌లోని పిల్లర్లను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల మరమ్మతులు పూర్తిగా సగంలో ఆగిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, రవీంద్ర, సురేష్ పాల్గొన్నారు.

స్మార్ట్ కిచెన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి - వేముల

స్మార్ట్ కిచెన్ స్థలాన్ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఎస్ఇ

మండల కేంద్రంలో నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్ ఓబుళ రెడ్డి యాదవ్, అధికారులకు పంచాయతీరాజ్ ఎస్ఈ మద్దెన్న సూచించారు. గురువారం మధ్యాహ్నం పంచాయతీరాజ్ డిఇ సుధాకర్‌రెడ్డితో కలిసి మండల కేంద్రంలో సుమారు రూ.38 లక్షలతో నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ పనులను ఆయన పరిశీలించి, తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎఇ అబ్దుల్లా, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

లింగాల : మధ్యాహ్నం భోజనం పథకం కోసం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో కిచెన్ షెడ్ నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని పిఆర్ ఎస్ఇ మద్దన్న సూచించారు. రూ.38 లక్షల వ్యయంతో నిర్మించే నిర్మాణాల పనులను ఆయన గురువారం పరిశీలించారు. డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని పిఆర్ ఎఇ మనోహర్‌రెడ్డిని ఆదేశించారు. నిర్మాణలో వేగం పెంచి పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE COMMISSIONER FOR WORKMEN'S COMPENSATION- CUM-DY.COMMISSIONER OF LABOUR :: KADAPA

E.C.No. 3/2023

Smt.Shaik Haseena W/o late Shaik Mahaboob Peer & Shaik Mahaboob Peera & 3 Others, resident of D.No.8/1244-A, Agadi Street, Yerrabadi, Kadapa City. **...Applicants**

Vs

Sri Syed Mohammad Ayub S/o Abdul Rasheed, Aged about 47 years, Lorry owner, Bearing No.APO2-TB-4248, resident of D.No.11/65-3, Kagithalapenta, Kadapa City. **...Opposite Party**

NOTICE TO OPPOSITE PARTY

The above E.C.No.3/2023 on the file of COMMISSIONER FOR WORKMEN'S COMPENSATION-CUM-DY.COMMISSIONER OF LABOUR :: KADAPA, OLD RIMS is filed by the Applicants against you and another for compensation it is posted on 22.11.2025 for your appearance before the above Court. You may appear on that day by 10.30 A.M. before the above Court and raise objections if any, otherwise orders will be passed against you.

//By Order of the Court//

M.SAI NIRANJAN BABU, B.A., B.L.,
M.SAI VAMSI KRISHNA, B.Com., LL.B.,
Advocates, KADAPA.